స్కెచ్:

# ఆకలిదృశ్య
# "మహాత్మ్యం"

ఆకలివేస్తోంది. ఉదయాన కాఫీహోటలు ప్రెుక్కకూడా చెల్లించుకోలేదని స్మృతికి తెచ్చుకుంటే సరికి బాధ తీవ్రమైంది. భరింపలేకండా వున్నా. అయ్యరు అగ్రహించాడేమో! తలపైకెత్తి చూచాను. గోడ గడియారం కూడా సుముఖంగానే వుంది, ఆకలి తీర్చుకోవడానికి నేను చెయ్యబోయ్యే ప్రయత్నానికి. గడియారం పదకొండుంపావు చూపిస్తోంది.

విధవ ఆవిడ రంగమ్మ, ఆవిడ పుణ్యామా అంటూ అరండలుపేట ఆరవ లైన్లో ఓభోజనహోటలు పెట్టింది. ఆకొన్న ఆంధ్రజీవాలన్నీ అక్కడికే వెడుతుంటాయి; అరవవారి తిండి సరిపడక; ...ధాభిమానం చంపుకోలేక. నూటికి నూరుపాళ్ళు ఆంధ్రుణ్నైన నేను, ప్రత్యేకమైన స్వాజాత్యాభిమానంగల నేను ఆంధ్రరాష్ట్రం రాకపోయినా దానికి చిహ్నంగావుండిపోయిన గోంగూరపచ్చణ్ణి అయినా రోజూ చవిచూచే భాగ్యం కలుగుతుందికదా అని అక్కడికే వెడుతూంటాను.

రోడ్డువెంట వెడుతూన్నాను. భరింపరానంత ఆకలితో బాహ్యాన్నంతా మరచి వస్తున్న నేను దారికి అడ్డువచ్చే జట్కావగైరాలను ఎలా తప్పించుకోగలిగానో దురూహ్యం. హోటలువచ్చేసింది. లోపలికి వెళ్ళబోతున్నాను. ఇంతలో ప్రక్కనే రోడ్డుమీద ఓదృశ్యం నన్ను ఆకర్షించింది. కరువుకు వచ్చినంతమంది జనం మూగివున్నారు. "వేలంవెర్రి" అని కొట్టి పారవేసి నాపని నేను చూసుకొనివెళ్ళి పోదామనుకున్నాను. కాని మనసలా చేయనిచ్చింది కాదు వెంటనే ఆతుర్దాగా వెళ్ళాను, 'విశేష' దాహంతో.

"ఏమిటండీ ఇది?"

"ఎవ రితను?"

"ఎంత సేపటినుంచి యిలా పడివున్నాడు?"

"నీళ్లుపొయ్యక పోయినారా?"

"చేతిలో 'తాళంచెవి' వుంచారా?"

ఇసక వేస్తే రాలడానికి గూడా సందులేకండా మూగివున్న జనం మధ్యలో, నోటివెంబడి నురుక్కక్కుతూ పడివున్న ఓ అభాగ్యుణ్ణి చూసి, జనంలోని ఓ పెద్దమనిషిని నే నడిగిన ప్రశ్నలివి వాత నాలుక్కరచుకున్నాను. ఆయన వైఖరిచూసి నిస్తుపొయ్యాను.

"అదేవండీ, అలా వళ్ళెల్లా కళ్లుచేసుకుంటారు? ఎంతో మర్యాదగా అడిగితే!"

ఆ పెద్దమనిషి నా మాటల్ను యిక లక్ష్యంచెయ్యకండా దృశ్యాన్ని శ్రద్ధతో చూస్తున్నాడు.

దృశ్యంలోని ప్రధాన పాత్రవేపు దృష్టి మరల్చాను. ఎవడు వీడు? ఎవడో పాపం! మూర్చపడి వుంటాడు. వాణ్ణి చూస్తే చాలా జాలివయ్యక మానదు. ముఖం కళ తప్పివుంది. పాలిపోయి వుంది. కండ్లు గజం లోతుకి పీక్కపొయ్యాయి! పొట్ట అస్తిని అంటుక వుంది. బహుశా ఆకలికి తాళలేక అలా మూర్చపడిపోయివుంటా డనుకున్నా.

"చూస్తే తెలియడంలేదూ? కండ్లు లేవూ?"

"ఎవరో? మా చుట్టమా?"

"ఎంతసేపట్నుంచో? నేనూ నీ మాదిరిప్పుడే రావడం."

"తాళంచెవి ఎప్పుడో వుంచారు. నీ విప్పుడు క్రొత్తగా చెప్పే పనిలేదు."

నే నడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలివి. చూస్తే ప్రతి సమాధానం నన్ను నమిలి మ్రింగేలాగుంది. పైగా ప్రతిదభా కండ్లెర్రచేసుకొని తన చేతివ్రేళ్ళను నా కండ్లలోనికి పోనిస్తూన్నాడు. ఎందుకో ఈయనకింత కోపం! దృశ్యంయెడల తన ఆసక్తికి ఓ ముహూర్తమాత్రం అంతరాయం కలిగించానని కాబోలు! ఇలాంటి గడుసరి ఆయన్ను అపలెంగు కడిగానా అని తగ ఆకలి ఎక్కువైనా కూడా మూర్చపోతారు కాబోలు! వెంటనే నా పరిస్థితి తలపుకొచ్చింది. నేను గూడా మూర్చపోతానేమో! నాకు గూడా బాగా ఆకలిగా వుందిగా మరి? ఛీ, ఛీ, ఏమిటీ పాడు ఆలోచన? అన్నం లేక మూర్చపడిపోయి వుండడు వీడు. మరి? ఒకసారి వీధిలోని గోడలమీదికి దృష్టి పోనిచ్చాను.

"తక్కువగా తినండి!"

గనోక్యూల్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వరఫార్మశి, రాజమండ్రి.

"బియ్యం తినకండి!"
"కూరగాయలే తినండి!"
"వారంలో ఒకరోజు పస్తుండండి!"
"దుబారా చెయ్యకండి!"
"చేస్తే శిక్షార్హులౌతారు!"

ఈ వాక్యాలు తాటికాయంత అక్షరాల్లో, భీకరంగా, గంభీరంగా గోడమీద అంటించిన కాగితాలమీద రాసున్నాయి. ప్రక్కనే ఓ అస్థిపంజరం వేలెత్తి పై వాక్యాలను చూపిస్తున్నట్టుగా కూడా చిత్రించబడివుంది.

నేను అనుకున్నాను. బహుశా ఈ భీతిగొల్పే అక్షరాలను చూసీ, వేలెత్తిచూపించే బొమ్మను చూసీ మూర్ఛిల్లి వుంటాడేమోనని కొంచెం ఓపికపడితే, ఈ లోపుగా ఆ మనిషి తెలివితెచ్చుకుంటే సంగతేవిటో తెలుసుకోవచ్చుగా? ఎందుకు యింతలోగా నేను 'యిది' గావడం? అనుకున్నా.

'మూర్ఛ' పడినవాడిమీద "వానలు కురియకపోతే శివలింగానికి సహస్ర ఘటాభిషేకం చేసినట్టు", ఏకధారగా, ఏకధాటిగా నీళ్ళు పోస్తున్నారు. నేనుకూడా అలా చేద్దామనుకున్నాను. కాని నేను "కాలేజీ స్టూడెంటు" నన్నమాట స్మృతికివచ్చి ఆ కోరిక చంపుకోక తప్పిందికాదు. ఈ లోపుగా చుట్టూవున్న జనం అంతా జేబుల్లోకి చెయిపోనిస్తున్నారు. నే నెందుకు అనుకున్నాను. ఓ అయిదు నిముషాల్లో నా అనుమానం నివృత్తి అయింది.

"కాని!"
"అర్ధణా!"
"అణా!"
"బేడ!"

మూర్ఛపడిన వాడివేపు హుటాహుటిగ వస్తున్నాయి. ఒక పెద్దమనిషి ఎక్కడా చెల్లని రూపాయికాగితం పడవేసి, అంత బాగుండదేమోనని, ఓ కానీ ధర్మం (!) చేసి మిగతా రూ 0-15-9 రొఖం జేబులో వేసుకున్నాడు! చిత్రగుప్తుడు తన పేరిటి కాతాలో ఆ 'కానీ' జమవేసుకోకపోతాడా అనుకున్నాడు కాబోలు, ఆయన ముఖంపై ఓ విషపునవ్వు తాండవించింది. నేనుకూడా జేబులోకి చెయి పోనిచ్చాను అప్రయత్నంగా. పెరుగు వేయించుకుందామని పట్టుకొచ్చిన రెండణాలూ చేతికి తగిలాయి ఇంతకూ "వాడికా అదృష్టం వుందిలే" అనుకుంటూ ఆ రెండణాలు మూర్ఛవాడివేపు విసిరి పారవేశాను.

ప్రజా దాతృత్వం దాదాపు ఓ అయిదు రూపాయీల దాకాపోయింది. ఇక ఓ పది రోజుల దాకా వాడికి "కూటికి" దిగులు లేదనుకున్నా నా మనస్సు కుదుటబడ్డది. దాంతోపాటు ఆకలికూడా స్మృతికి వచ్చింది.

హోటలుకు వెళ్లాను. తిన్నాను. విచారించాను పెరుగువేసుకునే అదృష్టం లేనందుకు. బయటపడ్డాను. రూముకు వెడదామనుకున్నాను. కాని యిందాకటి విషయం ఏమయిందేమోనని అలా దృష్టి ప్రసరించాను జనంవేపుకు ఇప్పుడు జనం జాస్తయ్యారు ఇందాకటికన్నా. జనంలోంచి 'దేముడా' అన్న మకుటంతో ఏడుపు వినపడుతోంది. హుటాహుటిగా అక్కడికి వెళ్లాను. సంగతేవిటో తెలుసుకున్నాను.

మూర్ఛవాడు చచ్చిపొయ్యాట్ట!

వాడిభార్య కాబోలు కళావిహీనమైన కళేబరంపైబడి గొల్లునగోడు కుడుస్తున్నది. జుట్టు పీక్కుంటున్నది. గుండె బాదుకుంటున్నది.

"అయ్యో," "పాపం" అన్న అర్థంలేని సానుభూతిమాటల (!) తో ప్రజలంతా గుసగుసలుపోతున్నారు.

ఒకరిద్దరు 'వూరుకోమ్మా, వూరుకో, అయ్యో, పాపం, ఆకలిచావా? అంటూ వూరడించడానికి ప్రయత్నించారు.

మళ్ళీ ప్రజల్లోంచి కాన్లూ, అర్ధణాలూ, అణాలూ బేసలు!

ఇదంతా ప్రజలసానుభూతి హృదయాలకు చిహ్నాలు!

కుటుంబానికంతా 'జీవగర్ర' అయిన మనిషి పొయ్యాడని విలపిస్తోంది పాపం ఆ అభాగ్యురాలు!

"రెక్కలు రాని పిల్లల్ని వదలి పెట్టి పొయ్యావా?" అంటున్నది.

"నడిసముద్రంలో తుఫానులో వదిలి పెట్టిపోతున్నావా?" అంటూ దుఃఖిస్తున్నది.

ఆవిడ ఒక్కసారి ప్రజలకేసి చూసింది. నీచులు, కఠినహృదయులు, అనుకొని ముఖం దించుకుంది. ఈనిముషాన దాతలు! వెనుకటి నిముషాన హంతకులు! నిజంగా తన భర్తను చంపేసింది ఈకఠోర హృదయులే. పాపం! ఆకలి భరించలేక ఎంతమందిని అడిగుంటాడో ఒక కానీ డబ్బివ్వమనీ, ఓపట్టెడన్నం పెట్టమని! కాని ఒక్కరు కూడా పెట్టివుండరు! ఈ నిముషానవున్న దాతలందరూ ఏమయి పొయ్యారో వెనుకటి నిముషానీ? బ్రతికి వుండగా లేని సహాయం, చచ్చింతరువాత వస్తుంది కాబోలు! కొట్లాటంతా అయిపోయింతరువాత కరవేగానవచ్చే పోలీసుదళంలాగ! ఎందుకు తన కిప్పుడు ప్రజలిచ్చేడబ్బంతా? తలకొట్టివేసిం తరువాత దుస్తులివ్వబోవడం దేనికి?

అసలు తనభర్తకు 'మూర్ఛ' అని ఎవరూ తేల్చింది? ప్రజలే నా? మూర్ఖులు! ఆకలితో సొమ్మసిల్లిపడ్డాడు కాబోలు! అది మూర్ఛ అవుతుందా? ఔను ప్రజల దృష్టిలో అంతే!

ఆకలితో స్మృతి తప్పిపోవడం...... "మూర్ఛ!" జబ్బు!!

"ఆకలి చావు"......"సమాధి!"

అందరితో బాటు నేనూ రెండశ్రుబిందువులు రాల్చాను. పేదాడి ఆత్మకు శాంతి నీయవలసిందిగా భగవంతుణ్ణి ప్రార్థించాను. రూముకు వెళ్ళాను విచారంతో.

తెల్లవారింది. పత్రిక వచ్చింది. పూజలు చెక్కిన దీర్ఘ చతురశ్రంలో "అరండలు పేట ఆరవ లైన్లో ఆకలిచా"వన్న వార్త తాటికాయంత అక్షరాల్లో వేసుంది.

పదిరోజులు గడిచినట్టు క్యాలెండరు చూపెట్టింది.

ఉదయం 'పత్రిక' వచ్చింది. అందులో చూచాను. "అరండలు పేట ఆరవ లైన్లో ఆకలిచావన్న వార్త నిరాధార"మని ప్రభుత్వ ప్రకటన వుంది.

సినిమాలో క్లోజప్ యిచ్చినలాగా ఆనాటి దృశ్యం నాకళ్ళకు కట్టినట్లైంది.

రంగమ్మ భోజన హోటలు!...శవం.... జనం!

స్వయంగా ఆ దృశ్యాన్ని చూచిన నా కళ్లు ప్రభుత్వానికి కండ్లు లేవన్నాయ్.

స్వయంగా చావుకు గురైన వాడి భార్య యేడ్పును విన్న నా చెవులు ప్రభుత్వానికి చెవులు లేవన్నాయి.

ఈ రోజుకూ అలాగే అంటున్నాయి. ★


**ధాతువర్ధని**

శుక్లనష్టమునకు ప్రశస్తమైనది కాళ్లనొప్పులు, బలహీనత, గుండెదడ, మేహములు, [illegible], అతిమూత్రం మొ॥ ఖండించి ఇంద్రియమును వృద్ధిపరచి అధిక సంభోగశక్తినిచ్చును. సీసా రు. 4-12, వి. పి. రు. 0-14-0.

వైద్య దూబగుంట సుబ్రహ్మణ్యం
ఇండియన్ మెడిసన్ హౌస్
బకింగ్‌హాంపేట - విజయవాడ. 2.
([illegible])